సాక్షి జోగులాంబ గద్వాల


గురువారం । 12 । అక్టోబర్ । 2023



ప్రతిభకు ప్రోత్సాహం

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు 10లో ►



స్వల్పంగా తగ్గిన ఉల్లి ధర

దేవరకద్ర మార్కెట్‌యార్డులో జరిగిన వేలంలో ఉల్లి ధర స్వల్పంగా తగ్గింది.

వివరాలు 10లో ►

గరిష్టం/కనిష్టం
36.7 /20.9

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత.. రాత్రి చలితీవ్రత కాస్త ఉంటుంది.

న్యూస్‌రీల్

ఒరిజినల్ ధృవపత్రాలు అందజేయాలి

గద్వాల క్రైం: ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 12, 13 తేదీలో జిల్లా పోలీసు కార్యాలయంలో తమ ఒరిజినల్ విద్య, క్రీడలు, సంబంధిత అటెస్టెడ్‌లు అందజేయాల్సిందిగా ఎస్పీ సృజన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10: 30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మల్దకల్: మిరప పంటల సాగుకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి మహమ్మద్‌భాష రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని మల్లెందొడ్డిలో మిరపపంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు నాణ్యమైన మిరప విత్తనాలను వాడటంతోపాటు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలను సాగుచేసి అధిక దిగుబడులను పొందాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో పంటపొలాల భూసారం దెబ్బతిని నష్టపోయే వీలుందన్నారు. అలాగే వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని, వీలైనంత వరకు పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలన్నారు. లైసెన్సు కలిగిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, ఏఈఓలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్



ఉండవెల్లి: ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాబోతుందని, పేదలకు అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మారమునగాల–2లో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. ఆయన కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ అని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలన సాగిస్తోందని, సంక్షేమ పథకాలు పేదలకు, నిరుద్యోగులకు, కౌలు రైతులకు అందడం లేదన్నారు. త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులను ఆదుకుంటామని పేర్కొన్నారు. పలువురు బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచులు నరేందర్ నాయుడు, శేషన్ గౌడు, నాగేష్, మండల అధ్యక్షుడు గోపాల్, రాము, నాయకులు నర్సన్‌గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, తదితర్లు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

గట్టు: విద్యుత్ కోతలపై బుధవారం రైతులు ఆందోళన నిర్వహించారు. మాచర్ల, ఆలూరు సబ్ స్టేషన్ల దగ్గర ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఎండిన పంటలతో ఆందోళన నిర్వహించారు. మాచర్ల సబ్ స్టేషన్ పరిధిలోని గత 15 రోజులుగా విద్యుత్‌కోతలను విధిస్తున్నారని, కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతొందో అర్థం కావడం లేదని రైతులు వాపోయారు. వానాకాలంలో సాగు చేసుకున్న పంటలు వర్షాభావ వాడు పట్టాని, బోరు నీటి ద్వారా పంటలను రక్షించుకుందామనుకుంటే విద్యుత్ కూడా సక్రమంగా ఉండడం లేదని రైతులు వాపోయారు. పత్తి, మిరప, వేరుశనగ పంటలు ఎండిపోతున్నట్లుఆందోళన వ్యక్తం చేశారు. 24 గంటల ఉచిత కరెంట్ అమలు కావడం లేదని, 10 గంటలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, ఇలా అయితే పంటలు పండించుకోవడం కష్టమని వాపోయారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట వంటావార్పుతో, ఎండిన పంటలతో రైతులు ఆందోళన నిర్వహించారు. ఆలూరు సబ్ స్టేషన్ దగ్గర రైతులు కరెంట్ కోతలకు నిరసనగా ఆందోళన నిర్వహించారు. ఇలా అయితే పంటలను రక్షించుకోవడం కష్టమని ఆందోళన వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.



సరిహద్దులో నిఘా

మద్యం అక్రమ తరలింపుపై ఉక్కుపాదం

- కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు
- కోడ్ అమలు నుంచి మూడు కేసులు నమోదు



అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు (ఫైల్)



గద్వాల క్రైం: ఎన్నికల నగారా మోగడంతో ఎలక్షన్ కమిటీ మద్యం అక్రమ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా సరిహద్దులైన కర్నాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో చెక్ పోస్టుల వద్ద ప్రతి అనుమానిత వాహనాలను క్షుణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ఆయా పార్టీల నాయకులు మద్యాన్ని పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు గుర్తించింది. గడచిన 10 నెలల వ్యవధిలో జిల్లా ఎక్సైజ్ శాఖ 37 కేసులు నమోదు చేయడంతోపాటు 41 మందిని అరెస్టు చేసింది. పట్టు బడిన మద్యం విలువ రూ. 4.70లక్షలు. ఇక ఎన్నికల కోడ్ జారీ అయినప్పటి నుంచి మూడు కేసులు నమోదయ్యాయి. మరో వైపు కర్నాకట నుంచి అనుమతి లేని మద్యం ఆంధ్రప్రదేశ్‌కు చెక్‌పోస్టులను దాటుకొని తరలిపోతుంది. పక్కా సమాచారం మేరకు దాడులు చేపట్టి నిలువరిస్తున్నారు. పూర్తి స్థాయిలో ఉక్కుమోపదం మోపడంలో అధికారులు విఫలయ్యారనే విమర్శలు ఉన్నాయి.

చెక్‌పోస్టుల ఏర్పాటు

బల్గెర, నందిన్నె, పూల్లూరు, చెక్ పోస్టులను దాటుకుని అయిజ, శాంతినగర్, రాజోళి, అలంపూర్ టోల్‌గేట్, నది మార్గంలో అనుమతి లేని మద్యం ఆంధ్రప్రదేశ్‌కు తరలుతోందని సమాచారం. 14వ జాతీయ రహదారి మీదుగా సైతం లిక్కర్ రవాణా చేస్తున్నారు. ప్రతి నిత్యం తనిఖీలు చేస్తున్న క్రమంలో అధికారుల కళ్లుగప్పి వెళ్తున్నారా..? లేక వారి ఒప్పందాల మేరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా.. అనే అంశాలపై సైతం ఎలక్షన్ కమిటీ నిఘా ఉంచింది.

ప్రత్యేక బృందాలతో..



సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటుచేశాం. ప్రత్యేక బృందాలు నిరంతరం తనిఖీలు చేపడుతున్నాయి. అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాం. అక్రమ మద్యాన్ని పూర్తి స్థాయిలో కట్టడి చేస్తాం. – గోపాల్, ఎక్సైజ్ సీఐ

కల్తీ లిక్కర్‌పై ఆరా..

జిల్లా పరిధిలోని 36 మద్యం దుకాణాలు, 7 రెస్టారెంట్లలో జరిగే క్రయా విక్రయాలపై నిఘా ఉంచి రోజు వారి అమ్మకాలపై నివేదికలను ఎక్సైజ్ శాఖ నుంచి తెలుసుకుంటున్నారు. మరో వైపు 2018లో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో జరిగిన లెక్కల ఆధారంగా వివరాలను సేకరిస్తున్నారు. మద్యం షాపులలో ప్రస్తుత స్టాకు, ఎంత మేర మద్యం కొనుగోలు చేసేందుకు ఆర్డర్లు చేశారు. దుకాణాల వారీగా జాబితా సేకరిస్తున్నారు. అయితే అసలు సమస్య మరోటి ఉంది. కల్తీ లిక్కర్ తయారీకి సంబంధించిన ముఠా సభ్యులు కేటీదొడ్డి కేరాఫ్‌గా ఉంది. ఈ ముఠా సభ్యులే ఇతర రాష్ట్రాలకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పట్టుబడిన క్రమంలో రూ.16లక్షల విలువ గల మద్యం, నేరం ఒప్పుకున్నారు. ఇలాంటి వ్యక్తుల జాబితాను సైతం ఎలక్షన్ కమిటీ ఆరా తీస్తుంది.

ముమ్మరంగా వాహనాల తనిఖీ.. నగదు పట్టివేత

- ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం అయిజ, కేటీదొడ్డి, మానవపాడు, ధరూరు మండలాల్లో తనిఖీలు చేపట్టగా రెండు చోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- అయిజలోని ఉప్పల దొడ్డిపేట క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పులికల్‌కు చెందిన వ్యక్తి కారులో రూ.1,59లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- ధరూరు మండలం గద్వాల – రాయచూర్ రహదారిలోని కోతులగిద్ద స్టేజీ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 87వేల నగదు పట్టుబడింది. కేటీదొడ్డి మండలం చింతలకుంటకి చెందిన అల్లారం మొగిలప్ప కారులో నగదును తరలించడాన్ని గుర్తించి జిల్లా కేంద్రంలోని ప్రత్యేక కమిటీ వద్దకు పంపించింది. సరైన ఆధారాలు చూయిచడంతో నగదును సదరు వ్యక్తికి ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.
- కేటీదొడ్డి మండలం నందిన్నె చెక్‌పోస్టును, వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చిన సీఐ ఖాలీద్ తనిఖీ చేశారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: శాసనసభ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఐడీవోసీ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తప్పకుండా కోడ్‌కు లోబడి పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. అదేవిధంగా పార్టీలకు చెందిన కార్యక్రమాలను నిర్వహించుకోవాలంటే ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఎంసీఎంసీ కమిటీని ఏర్పాటు చేశామని ఈకమిటీ ద్వారా అనుమతులు పొందాల్సి ఉందన్నారు. వివిధ ప్రసార మాద్యమాలు, సోషల్‌మీడియాలో వచ్చే వార్తలను నిశితంగా పరిశీలిస్తామని, ఇందుకు సంబంధించి అందరు కూడా కోడ్‌ను ఉల్లంఘించకుండా ఎక్కడా కులాలు, మతాలు రెచ్చగొట్టకుండా, శాంతిభద్రతలకు విఘాతం ఏర్పర్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు పార్టీల పరంగా ముద్రించే కరపత్రాలు, పోస్టర్లకు సంబంధించి పూర్తి వివరాలను ప్రింటింగ్ ప్రెస్ వారి వివరాలను సమర్పించాలని, ప్రచారానికి వినియోగించే వాహనాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి, పోలీసుశాఖ అనుతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన నాటి నుంచి ఫలితాలు వెల్లడయ్యే వరకు ఎన్నికల ఖర్చును 30రోజుల్లో సమర్పించాలని, లేనిపక్షంలో అట్టి అభ్యర్థులు అనర్హతకు గురవుతారన్నారు. సమావేశంలో ఆర్డీవో చంద్రకళ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నరేష్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేలా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలంపూర్ జోగులాంబ ఆలయంలో ప్రతిఏటా నిర్వహించేలా ఈ ఏడాది కూడా దసరా శరవన్నవరాత్రి మహోత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందిగా పోలీసు బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా అత్యవసర వైద్యం అందించేలా అంబులెన్స్, ప్రాథమిక చికిత్స అందించేలా ప్రత్యేక వైద్యశిభిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దీంతో ఈనెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిరంతరంగా అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఆర్డీవో చంద్రకళ, ఏవో వీరభద్రప్ప, ఈఓ పురెందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ, కమీషనర్ దయానంద్, పీఆర్ ఈఈ విజయాకుమార్, అలంపూరు తహసీల్దార్ మంజుల, ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

ఎన్నికలకు అవసరమైన ఈవీఎంలను అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎంలు, వీవీప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎస్పీల బదిలీ



నరసింహ, మహబూబ్‌నగర్



మనోహర్, నాగర్‌కర్నూల్



వెంకటేశ్వర్లు, నారాయణపేట



సృజన, జోగులాంబ గద్వాల

- వనపర్తి జిల్లా మినహా అందరికీ స్థానచలనం
- ఇన్‌చార్జ్ ఎస్పీలుగా ఏఎస్పీలకు బాధ్యతలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక బుధవారం ఉమ్మడి జిల్లాలోని నాన్ క్యాడర్‌కు చెందిన నలుగురు ఎస్పీలను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ ఎస్పీ కె. నరసింహ, నాగర్‌కర్నూల్ ఎస్పీ కె.మనోహర్, జోగుళాంబ గద్వాల ఎస్పీ కె.సృజన, నారాయణపేట ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు బదిలీ కానున్నారు. గురువారం సాయంత్రం 5 గంటల్లోగా వీరిస్థానంలో కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని ఈసీ ఆదేశించింది. కాగా కొత్త ఎస్పీలు వచ్చే వరకు మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్ ఎస్పీగా రాములు (ఏఎస్పీ), నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జ్ ఎస్పీగా సీహెచ్ రామేశ్వర్ (ఏఎస్పీ), గద్వాల ఇన్‌చార్జ్ ఎస్పీగా ఎస్.రవి (ఏఎస్పీ), నారాయణపేట ఇన్‌చార్జ్ ఎస్పీగా కె.సత్యనారాయణ(ఎస్‌డీపీఓ)లకు బాధ్యతలు అప్పగించారు.

- మహబూబ్‌నగర్ ఎస్పీగా నరసింహ జనవరి 26న బాధ్యతలు స్వీకరించారు. కేవలం 8 నెలల వ్యవధిలోనే ఆయన బదిలీ కానున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ సృజన సైతం జనవరి 27 నుంచి కొనసాగుతున్నారు. గతంలో ఆమె వనపర్తి జిల్లాలో డీఎస్పీగా పనిచేశారు. నాగర్‌కర్నూల్ ఎస్పీగా మనోహర్ 2021 డిసెంబర్ 24న బాధ్యతలు చేపట్టారు. నారాయణపేట ఎస్పీగా వెంకటేశ్వర్లు 2021 డిసెంబర్ 26న బాధ్యతలు స్వీకరించారు. ఇరువురు దాదాపు 21 నెలల పాటు సేవలందించారు. ఎన్నికల్లో పలువురు ఎస్పీలు ఏకపక్ష ధోరణిలో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో బదిలీలపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్పీ సృజన

గద్వాల క్రైం: ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సృజన అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నవంబర్ 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్తులు, అనుమానితుల వివరాలు సేకరించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. నగదు, మద్యం, వస్తు సామగ్రి తదితర వాటిని అనుమతి లేకుండా తరలిస్తున్నట్లు తెలిస్తే నిఘా ఉంచి అదుపులోకి తీసుకోవాలన్నారు. వివిధ పోలీంగ్ బూత్‌ల వారిగా రూట్ మ్యాప్‌లను గుర్తించి సమస్యాత్మక, హింసాత్మక కేంద్రాల పై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రవి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు ఉన్నారు.

సంకల్ప బలంతో లక్ష్య సాధన

గట్టు: బాలికలు చదువు విషయంలో సంకల్ప బలంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, అప్పుడే చదువు చెప్పిన గురువులు, కన్న తల్లిదండ్రులు గర్విస్తారని గద్వాల ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంటా కవితాదేవి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గట్టులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో జడ్జి సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఏదీ ఊరికే రాదని, కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని, పాఠశాల స్థాయి నుంచే బాలికలు కలల సాకారానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా వాటిని వ్యతిరేకించాలని, బాల్య వివాహాల వలన అనేక సమస్యలు తలెత్తనున్నట్లు తెలిపారు. సీడీపీఓ కమలాదేవి, డీసీపీఓ నర్సింహ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు యుగందర్, ప్రభాకర్‌తోపాటు రాజేందర్, లక్ష్మణ్, వరలక్ష్మీ, మోనయ్య, యశ్వంత్, వాణి పాల్గొన్నారు.

కారెక్కనున్న రావుల..?

మంత్రి ఎర్రబెల్లి, మరో ఎమ్మెల్సీ రాయబారం

- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతోనూ మంతనాలు
- ఎమ్మెల్సీగా అవకాశమిస్తామని హామీ
- మహబూబ్‌నగర్ పార్లమెంట్‌పై చంద్రశేఖర్‌రెడ్డి ఆసక్తి
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఖాళీ కానున్న టీడీపీ
- వనపర్తిలో మంత్రి సింగిరెడ్డి గెలుపు సునాయాసమని గులాబీల ధీమా



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: టీడీపీ సీనియర్ నేత, ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి సైకిల్ దిగి కారెక్కేందుకు సిద్ధమవుతున్నారా.. అంటే అవుననే సమాధానం విన్పిస్తోంది. ప్రస్తుతం మారుతున్న రాజకీయ పరిణామాలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. బీఆర్‌ఎస్‌లోని టీడీపీ పాతకాపుల రాయబారం.. మంత్రులతో మంతనాలు.. అనుచరులు, ముఖ్య కార్యకర్తలతో అభిప్రాయ సేకరణ చేస్తుండడం వంటి అంశాలు ఆయన పార్టీ మారుతున్నారనేందుకు బలం చేకూరుస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన క్రమంలో రావుల అడుగులు వేస్తున్న తీరు.. వనపర్తితో పాటు ఉమ్మడి పాలమూరులో చోటుచేసుకునే పరిణామాలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

మహబూబ్‌నగర్ లోక్‌సభపై ఆసక్తి

రావుల చంద్రశేఖర్‌రెడ్డి రాకను వనపర్తికి చెందిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కూడా స్వాగతించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీగా రావులకు అవకాశం ఇచ్చేందుకు మంత్రులు హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే చంద్రశేఖర్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్‌పై ఆసక్తి చూపినట్లు వినికిడి. రానున్న ఎన్నికల్లో ఎంపీగా ఇక్కడి నుంచి పోటీ చేయాలని అనుకుంటున్నట్లు తన మనసులోని మాటను వారికి చెప్పినట్లు ఆయన ముఖ్య అనుచరులు గుసగుసలాడుకుంటున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే మరో వారం రోజుల్లో సీఎం కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. రావుల బీఆర్‌ఎస్‌లో చేరడం ఖాయమైతే వనపర్తిలో సింగిరెడ్డి గెలుపు మరింత సునాయాసమవుతుందని, దేవరకద్రలో సైతం ప్రభావం ఉంటుందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

రావుల నేపథ్యం..

న్యాయవాద వృత్తి నుంచి బీజేపీ పార్టీ మద్దతుతో కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామ సర్పంచ్‌గా రాజకీయ అరంగేట్రం చేశారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత 1982లో సర్పంచ్ హోదాలో ఆ పార్టీలో చేరారు. నాటి నుంచి క్రియాశీల రాజకీయాల్లో రాణిస్తూ పలు రాష్ట్ర, ఉన్నతస్థాయి పదవులతో పాటు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1987 నుంచి 89 వరకు రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. 1994లో వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందారు. పార్టీ చీఫ్ విప్‌గా విధులు నిర్వర్తించారు. 1999లో రెండోసారి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2002 నుంచి 2008 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. 2009లో మూడోసారి పోటీ చేసి మంత్రి చిన్నారెడ్డిపై గెలుపొందారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగోసారి పోటీ చేసిన రావుల ఓటమి పాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ పొత్తులో ఆయనకు పోటీ చేసే అవకాశం లభించలేదు.

టీడీపీ పాత మిత్రులతో రాయబారం..

సౌమ్యుడిగా, రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవమున్న నేతగా గుర్తింపు పొందిన రావుల గులాబీ గూటికి చేరుతున్నట్లు ఇటీవల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ మేరకు ఉత్తర తెలంగాణకు చెందిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు ఓ ఎమ్మెల్సీ రాయబారం నడిపించినట్లు తెలుస్తోంది. వీరు గతంలో టీడీపీలో ఉండగా.. రావులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ చొరవతో హైదరాబాద్‌లో ఆయనతో మాట్లాడిన సందర్భంగా రాజకీయ భవిష్యత్‌పై చర్చ జరిగినట్లు సమాచారం. అనంతరం మంత్రి కేటీఆర్‌తో పాటు ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావుతోనూ మంతనాలు కొనసాగినట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో సైకిల్'..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో టీడీపీ కనుమరుగైన విషయం తెలిసిందే. అయితే ఉమ్మడి పాలమూరులో ఒకరిద్దరు నేతలు చాలాకాలం వరకు ఆ పార్టీలోనే కొనసాగారు. మక్తల్‌కు చెందిన టీడీపీ నేతలు సీతాదయాకర్‌రెడ్డి దంపతులు కొన్నాళ్ల క్రితం పార్టీని వీడుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కొంత కాలం తర్వాత దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సీతమ్మ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరగా.. ప్రస్తుతం రావుల సైతం కారెక్కనుండడంతో ఉమ్మడి జిల్లాలో టీడీపీ పూర్తిగా ఖాళీ అయినట్లేనని తెలుస్తోంది. కాగా.. పార్టీ మారే అంశంపై రావులతో 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

చంద్రబాబును కలిసేందుకు..

తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ రాజీనామా చేసిన అనంతరం ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కసరత్తు ప్రారంభించిన క్రమంలో పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న రావుల పేరు ప్రస్తావనకు వచ్చింది. ఇప్పుడున్న నేతల్లో సీనియర్ కావడం, తెలంగాణలో సమకాలీన రాజకీయాలపై పట్టు ఉండడం, ఇతర పార్టీలను సమర్థవంతంగా ఢీకొట్టగల సామర్థ్యం ఉన్న నేపథ్యంలో చంద్రబాబు ఆయన వైపే మొగ్గు చూపారు. అయితే అనారోగ్య కారణాలతో రావుల ఆ పదవికి దూరంగా ఉన్నప్పటికీ.. ఇప్పటివరకు టీడీపీలోనే కొనసాగారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సైకిల్ దిగేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్ట్ అయి జైలులో ఉన్న చంద్రబాబును కలిసి మనసులో మాట చెప్పేందుకు మిలాఖత్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ దుర్మరణం


శ్రీరామ్‌రెడ్డి (ఫైల్)

గద్వాల క్రైం: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని జమ్మిచేడు శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... రాజోళి మాజీ సర్పంచ్, ప్రస్తుత బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీరాంరెడ్డి (45) పని నిమిత్తం తన కారులో బుధవారం ఉదయం గద్వాలకు చేరుకున్నాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా.. జమ్మిచేడ్ శివారులో రోడ్డుపక్కన ఇనుప కడ్డీల లోడ్‌తో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇనుప కడ్డీలు ఛాతి, తలలోకి చొచ్చుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు సైతం పూర్తిగా దెబ్బతింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

రాజోళిలో విషాదఛాయలు..

రాజోళి: మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈయన తల్లిదండ్రులు ఇద్దరూ సర్పంచ్‌గా పని చేశారు. భార్య సంధ్య, కుమారులు అభిషేక్‌రెడ్డి, వంశీకుమార్‌రెడ్డి ఉండగా.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా విదేశాల్లో స్థిరపడ్డారు.

డెంగీతో చిన్నారి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: వారం రోజుల కిందట డెంగీ సోకిన చిన్నారి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని రహమత్‌నగర్ కాలనీకి చెందిన షాజీమ్‌న్(6) వారం రోజుల కిందట జ్వరం బారిన పడటంతో జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూయించగా డెంగీ నిర్ధారణ అయింది. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.

సెల్‌ఫోన్ కొనుగోలుకు డబ్బు ఇవ్వలేదని..


- చెరువులో దూకి వ్యక్తి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: సెల్‌ఫోన్ కొనేందుకు డబ్బులు ఇవ్వలేదని క్షణికావేశంలో చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం మేరకు.. మండలంలోని మంతటికి చెందిన దాసరి సతీష్ (32) సెల్‌ఫోన్ కొనేందుకు తన తల్లిని డబ్బులు అడిగాడు. ఆమె సమీప బంధువు దగ్గర తీసుకోమని చెప్పింది. అతడి వద్దకు వెళ్లి అడగగా ఇవ్వకపోవడంతో మద్యం మత్తు, క్షణికావేశంలో మంగళవారం రాత్రి గ్రామ చెరువులో దూకాడు. గుర్తించిన పశువుల కాపరి కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బుధవారం ఉదయం మృతదేహం నీటిపై తేలియాడటం గుర్తించి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

జడ్చర్ల: పట్టణంలోని వంద పడకల ఆస్పత్రి ఎదుట డ్రెయినేజీలో ఓ గుర్తు తెలియని మహిళ(37) మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. మహిళ మృతదేహం మురుగులో తేలియాడుతుండగా.. ఆస్పత్రికి వెళ్తున్న వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అయితే సకాలంలో పోలీసులు స్పందించి మృతదేహాన్ని బయటకు వెలికి తీసి గుర్తించే ప్రయత్నం చేయలేదని ఆరోపిస్తూ.. కొందరు ఆస్పత్రి ఎదుట ఉన్న జడ్చర్ల- కల్వకుర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ రమేశ్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని మహిళ మృతదేహాన్ని బయటకు తీసి బాదేపల్లి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మహిళ మూడు రోజుల కిందట మురుగులో పడి మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కాగా మహిళ ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడిందా మరేదయిన కారణంతోటి మృత్యువాత పడిందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలియజేశారు.

25 గొర్రె పిల్లలు మృతి



బిజినేపల్లి: మండలంలోని పాలెం చెందిన బక్క నారాయణ, పద్మ దంపతులకు చెందిన 25 గొర్రె పిల్లలు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం గొర్రె పిల్లలను జల్ల కింద దాచి వాటి తల్లులను, ఇతర జీవాలను మేత కోసం తీసుకెళ్లారు. వారు ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి అనుమానాస్పదంగా మృతి చెంది ఉండటం గమనించారు. ఒకే సారి 25 గొర్రె పిల్లలు మృతి చెందిన ఉండటం వలన విష ప్రయోగం జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీటి విలువ దాదాపు రూ.2 లక్షలకు పైగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు 31వరకు పొడిగింపు
- ఎంపికైతే ఏడాదికి రూ.12వేల ఉపకార వేతనం
- డిసెంబర్ 10న పరీక్ష


విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష మెటీరియల్ అందజేస్తున్న డీఈఓ గోవిందరాజులు



కందనూలు: ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జాతీయ ఉపకార వేతనాలకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఎంఎంఎస్)కోసం దరఖాస్తులు స్వీకరిస్తుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మొదట ఈనెల 13నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చివరి తేదీ నిర్ణయించగా, బుధవారం ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ అవకాశాన్ని జిల్లా నుంచి ఏటా తక్కువ మంది విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. ఎక్కువమంది వినియోగించుకునేలా ఉపాధ్యాయులు దృష్టిసారిస్తే పేద విద్యార్థులకు మేలు కలగనుంది.

2008 నుంచి అమలు..

చురుకుదనం, తెలివితేటలు, చదువుపై మంచి పట్టున్న విద్యార్థులు ఆర్థిక కారణాలతో చదువుకు దూరం కారాదన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి జాతీయ ఉపకార వేతనాల పథకం అమలు చేస్తుంది. ఏటా జిల్లా నుంచి ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైన 9, 10వ తరగతుల విద్యార్థులకు ఏటా రూ.6వేల చొప్పున, ఇంటర్‌కు రూ.24వేల చొప్పున అందించేది. ప్రస్తుతం రెండింతలు చేశారు. ఏటా ఇచ్చే మొత్తాన్ని రూ.12 వేలకు పెంచారు. నాలుగేళ్లకు కలిపి విద్యార్థులు రూ.48 వేలు అందుకోనున్నారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబర్ 10న అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

చొరవ చూపితే ఎంతో లబ్ధి..

దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న అన్ని కులాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ చాటితే వారికి 9వ తరగతి నుంచి ఏటా ఉపకార వేతనం అందజేస్తారు. ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపికలో తెలకపల్లి, నాగర్‌కర్నూల్, ఊర్కొండ, బిజినేపల్లి, బల్మూర్ జిల్లాలో అగ్ర భాగాన నిలుస్తున్నాయి. జిల్లాలో గతేడాది 64మంది ఎంపికయ్యారు.

ఎంతో ఉపయోగం..



జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థులు ఎంపికైతే ఉన్నత చదువుల కోసం తల్లిదండ్రులపై భారం ఉండదు. ప్రస్తుతం ఈ ప్రోత్సాహకాన్ని రెట్టింపు చేయడంతో మరింత మేలు కలుగుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 వరకు అవకాశం ఉంది. జిల్లాలో ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాం.

– గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్

దరఖాస్తుకు అర్హతలు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. 7వ తరగతిలో ఓసీ, బీసీలు 55, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు పొంది, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 3.50 లక్షలలోపు ఉండాలి. దరఖాస్తు పూరించి రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఆధార్, ఆదాయ, కుల, నివాసం పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50తో బ్యాంకులో డీడీ తీసి డీఈవో కార్యాలయానికి పంపించాలి.

ఎన్నికలపై ఎక్సైజ్ శాఖ కసరత్తు

- సరిహద్దుల్లో మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు

మహబూబ్‌నగర్ క్రైం: ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ కసరత్తు ప్రారంభం చేసింది. ఎన్నికల విధులు, పాటించాల్సిన అంశాలపై ఉమ్మడి జిల్లాస్థాయిలో అధికారులు సమావేశాలు పూర్తి చేశారు. ఇప్పటికే ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్‌శాఖతో కలిసి కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఉన్న కృష్ణా, పుల్లూరు, నందిన్నె, బల్గెరతో పాటు కొత్తగా సరిహద్దు మొబైల్ చెక్‌పోస్టులు జలాల్‌పూర్, ఎక్లాస్‌పూర్, కాన్‌కుర్తిలలో ఏర్పాటు చేశారు. ఒక్కో చెక్‌పోస్టులో ఒక సీఐతో పాటు ఎస్‌ఐ ఇతర సిబ్బంది నిత్యం తనిఖీలతో పాటు నిఘా పెట్టనున్నారు. దీంతో పాటు రెగ్యులర్ తనిఖీలపై దృష్టి పెట్టారు.

జిల్లా	కేసులు	వ్యక్తుల అరెస్టు	ఐఎంఎల్ (లీటర్లు)	బీరు (లీటర్లు)
ఉమ్మడి జిల్లాలో అంతర్రాష్ట్ర మద్యం కేసుల వివరాలు				
మహబూబ్‌నగర్,పేట	82	40	818	20
నాగర్‌కర్నూల్	1	2	25	0
జోగుళాంబ గద్వాల	21	28	525	16
ఉమ్మడి జిల్లాలో నమోదు అయిన మద్యం కేసుల వివరాలు				
మహబూబ్‌నగర్,పేట	21	16	112	133
నాగర్‌కర్నూల్	7	7	42	17
జోగుళాంబ గద్వాల	17	20	44.68	8.45
వనపర్తి	2	2	6.78	23

ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే చెక్‌పోస్టుల ఏర్పాటు, మద్యం తరలింపుపై తనిఖీలు చేస్తున్నాం. నోటిఫికేషన్ తర్వాత అధిక సిబ్బందిని కేటాయించి తనిఖీలతో పాటు మద్యం స్టాక్ చేసే అంశాలపై నిఘా పెడతాం. ఉమ్మడి జిల్లాలో సరిహద్దు మొబైల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం.

– దత్తరాజ్‌గౌడ్, డీసీ ఎక్సైజ్‌శాఖ

చోరీ కేసులో జైలు శిక్ష

కొత్తకోట రూరల్: చోరీ కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఆత్మకూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శిరీష బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట, కానాయపల్లి, తిర్మలాయపల్లిలో 2016లో వరుస చోరీలు కాగా బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ కృష్ణ 2016 జనవరిలో జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పాల్వాయికి చెందిన వడ్డె గోపాల్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. బెయిల్‌పై బయటకు వచ్చిన వడ్డె గోపాల్‌కు ఏడేళ్ల తర్వాత 6నెలల జైలు శిక్ష రూ.200 జరిమానా విధించారు.

స్వల్పంగా తగ్గిన ఉల్లి ధర


దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిని వేలం వేస్తున్న వ్యాపారులు

- గరిష్టంగా రూ.2,600
- కనిష్టంగా రూ.1,620

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధర స్వల్పంగా తగ్గింది. రెండు నెలల నుంచి ఉల్లి ధరలు పెరుగుతూ స్వల్పంగా తగ్గుతూ వస్తున్నాయి. వారం రోజుల కిందట ఉల్లి ధర పెరిగి ఈ వారం కొంత మేర తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌కు గత సీజన్‌లో పండించిన ఉల్లినే రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. గత సీజన్‌లో రూ.వేయి దాటని ఉల్లి ధర ఇటీవల పెరగడంతో ఇప్పటి వరకు ఉల్లిని అమ్ముకోకుండా నిల్వ చేసుకున్న రైతులు ప్రతివారం కొంత అమ్మకానికి తీసుకొస్తున్నారు. వానాకాలం సీజన్ కింద వేసిన ఉల్లి మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. అయితే ఆరబెట్టకుండా పచ్చిగా ఉండటంతో ధర కనిష్టంగా వచ్చింది.

జోరుగా వేలం..

దేవరకద్ర మార్కెట్ అమ్మకానికి వచ్చిన ఉల్లిని వేలం వేశారు. స్థానిక వ్యాపారులతో పాటు వివిధ మార్కెట్ల నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో పాల్గొనడంతో జోరుగా వేలం కొనసాగుతుంది. నాణ్యంగా ఉన్న ఉల్లికి బాగా డిమాండ్ ఉండటంతో ఏకంగా క్వింటాల్ ఉల్లి ధర గరిష్టంగా రూ.2,600 వరకు పలికింది. ఇక రెండో రకం ఉల్లి కనిష్టంగా రూ.1,620 వరకు ధర వచ్చింది. గత వారం కన్నా గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.610 వరకు ధరలు తగ్గాయి. వేలం తరువాత తూకం వేసిన 45 కిలోల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.1,300, కనిష్టంగా రూ.800 వరకు విక్రయించారు. మార్కెట్‌లో వినియోగదారులతో పాటు చిన్న వ్యాపారులు ఎక్కువగా ఉల్లిని కొనుగోలు చేశారు. దేవరకద్ర సంతలో కిలో ఉల్లిపాయలు రూ.30 వరకు విక్రయించారు.

పచ్చజొన్నలకు భలే డిమాండ్..

దేవరకద్ర మార్కెట్‌కు వానాకాలం కింద మెట్ట పంటగా వేసిన పచ్చ జొన్నలను రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. మార్కెట్‌లో టెండర్ల ద్వార ధర నిర్ణయించే అవకాశం ఉన్నా.. చాలా మంది రైతులు నేరుగా అమ్ముకునే పరిస్థితి వచ్చింది. బుధవారం మార్కెట్‌కు కేవలం ముగ్గురు రైతులు పచ్చ జొన్నలు తీసుకొచ్చి కుప్పలుగా పోశారు. దీంతో పచ్చ జొన్నలను కొనడానికి వినియోగదారులు ఎగబడ్డారు. టెండర్ లేకుండానే రైతులు ధర నిర్ణయించి నేరుగా విక్రయాలు సాగించారు. క్వింటాల్ పచ్చ జొన్నలు గరిష్టంగా రూ.9,000, కనిష్టంగా రూ.8,600 ల వరకు విక్రయించారు. చాలా మంది వినియోగదారులు పచ్చ జొన్నలను బస్తాలుగా కొనుగోలు చేశారు. కొనేవారు ఎక్కువగా రావడంతో వినియోగదారులే బస్తాలకు నింపు కొని తూకాలు వేయించి తీసుకున్నారు.


మార్కెట్‌లో పచ్చజొన్నలు కొంటున్న వినియోగదారులు

ఆముదాలు క్వింటాల్ ధర రూ.5,459

దేవరకద్ర మార్కెట్‌లో జరిగిన ఈనామ్ టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,459, కనిష్టంగా రూ.5,452 గా ధరలు నమోదు అయ్యాయి. హంస ధాన్యం ధర గరిష్టంగా రూ.2,039 గా ఒకే ధర వచ్చింది.

ఇంటి మిద్దె కూలి చిన్నారి మృతి

- మరో యువతికి తీవ్ర గాయాలు


చిన్నారి వైష్ణవి (ఫైల్)


కూలిన ఇంటి మిద్దె

దామరగిద్ద: శిథిలావస్థకు చేరిన ఓ ఇంటి మట్టి మిద్దె కూలి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మద్దెల్‌బీడ్‌లో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నర్సప్పకు భగవంతు, బస్వరాజు, అంజి అనే ముగ్గురు కుమారులు. అందరూ 30 ఏళ్ల క్రితం నిర్మించిన మట్టిమిద్దె ఇంటిలోనే నివాసం ఉంటున్నారు. ఉదయం పత్తి ఏరే పని ఉండడంతో అందరూ పొలం వద్దకు వెళ్లారు. ఇంటి వద్ద అంజి భార్య అనిత, బస్వరాజు కుమార్తె వైష్ణవి ఉన్నారు. ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో కట్టె స్తంభంతో కూలడంతో అక్కడే ఆడుకుంటున్న వైష్ణవి, నర్సప్ప చిన్నకోడలు అనిత మట్టి మిద్దె కూలింది. దీంతో వారిద్దరూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించి.. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి, వెంటనే వారిని నారాయణపేట జిల్లాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. వైష్ణవి (3) మార్గమధ్యంలోనే మృతి చెందింది. అనిత చికిత్స పొందుతోంది.

తనిఖీల్లో నగదు సీజ్


మదనాపురం మండల కేంద్రంలో పట్టుబడిన నగదును చూపిస్తున్న ఎస్‌ఐ

వనపర్తి: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.14.25లక్షల నగదు, 150 లీటర్ల లిక్కర్‌ను పోలీసులు సీజ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుతం కోడ్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో పోలీసులు నిర్వహించిన సాధారణ వాహన తనిఖీల్లో వేర్వేరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎలాంటి పత్రాలులేకుండా తీసుకువెళ్తున్న నగదును సీజ్ చేశారు. వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగవరం సమీపంలోని భగీరథచౌరస్తా వద్ద మోటార్ సైకిల్‌పై రూ. 85వేలు, పెద్దమందడి పరిధిలోని వెల్టూరు చెక్‌పోస్ట్ వద్ద రూ.3.50 లక్షలు, మదనాపురంలో మోటార్ సైకిల్‌పై రూ. 9.85 లక్షల నగదును గుర్తించి ఎలాంటి పత్రాలు లేకపోవటం సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సీజ్ చేసిన నగదును ఆదాయపన్నుశాఖ అధికారులకు అప్పగించినట్లు ఆయా మండలాల ఎస్‌ఐలు తెలిపారు.

అయిజ: పట్టణంలోని ఉప్పల దొడ్డిపేట క్రాస్ రోడ్డు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పులికల్‌కు చెందిన వెంకటేష్ కారులో రూ.1.59లక్షలు లభించాయి. వాటిని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు.

మక్తల్: మండల కేంద్రంలోని బుధవారం టేకులపల్లి టోల్‌గేట్ వద్ద సీఐ రాంలాల్, ఎస్‌ఐ పర్వతాలు వాహనాల తనిఖీ చేస్తుండగా రాయచూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో రూ.1.40లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఒక వ్యక్తితో రూ. 50 వేలు మించి ఉండరాదని, ఎన్నికలు ముగిసే వరకు కోడ్ అమలులో ఉంటుందన్నారు.

జూనియర్లపై సీనియర్ విద్యార్థుల దాడి


లింగాల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న కుల సంఘాలు, విద్యార్థులు

- లింగాల గురుకుల పాఠశాలలో ఉద్రిక్త పరిస్థితులు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థుల దాడితో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి భోజన సమయంలో డార్మెటరీలో విద్యార్థుల క్యూ పద్ధతి విషయంలో సమస్య తలెత్తింది. 9వ తరగతికి చెందిన ముగ్గురు విద్యార్థులు క్యూ లైన్‌లో రాకపోవడంతో ఇంటర్ విద్యార్థులు వారిని మందలించారు. ఈ విషయంలో విద్యార్థుల మధ్య మాటామాటా పెరిగి పరిస్థితులు ఒక్క సారిగా వెడెక్కాయి. 9వ తరగతి విద్యార్థులను ఇంటర్ వారు గదిలో వేసి చితకబాదారు. వారి వీపులపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, కుల సంఘాల వారు బుధవారం గురుకుల కళాశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. కళాశాల ఎదుట ఉన్న రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యతలను విస్మరించిన ప్రిన్సిపాల్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కుల సంఘాల నాయకులు బంగారయ్య, శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- తాళ్లగడ్డ పెద్దవాగు నుంచి తరలింపు
- అడ్డుకునేందుకు యత్నించిన జానంపేట వాసులు


మంగళవారం రాత్రి తాళ్లగడ్డ నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్

అడ్డాకుల: మూసాపేట మండలం తాళ్లగడ్డ పెద్ద వాగులో ఇసుక అక్రమ రవాణా జోరందుకుంది. రాత్రివేళ ట్రాక్టర్ల ద్వారా వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. వాగులోకి మట్టితో దారులు వేయించి రాత్రివేళ కొందరు అక్రమార్కులు ఇసుక రవాణాకు పాల్పడుతున్నారు. తాళ్లగడ్డ నుంచి ట్రాక్టర్ల ద్వారా తెచ్చే ఇసుకను జానంపేట శివారులో ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేటు కంపెనీకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు జానంపేట, చక్రాపూర్ గ్రామాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మంగళవారం రాత్రి కొందరు జానంపేట గ్రామస్తులు తాళ్లగడ్డ నుంచి వచ్చే ట్రాక్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే ట్రాక్టర్లు తప్పించుకుని వెళ్లిపోగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. పోలీసులు కూడా జానంపేటలోనే ఉన్న ట్రాక్టర్లను పట్టుకోవడానికి ముందుకు రాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలీసుల సహకారంతోనే ఇసుక అక్రమ రవాణా సాగుతోందని జానంపేట వాసులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ కె.శ్రీనివాసులును వివరణ కోరగా.. గ్రామస్తులు సమాచారం ఇవ్వగానే కానిస్టేబుళ్లు అక్కడికి వెళ్లగా.. అప్పటికే ట్రాక్టర్లు తప్పించుకుని వెళ్లాయని తెలిపారు. తాళ్లగడ్డ వద్ద నిఘా ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటామని పేర్కొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

గద్వాల రూరల్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఆవిరి రూపంలో 118, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 731 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 851.1 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 851.1 అడుగుల వద్ద 82.3 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 31,784 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 4,042, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,590, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 11.633 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 23,797 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 152 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

మద్యం బాటిళ్ల పట్టివేత


మాగనూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన పోలీసుల తనిఖీలో కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 83 బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ చెందిన సోమశిల ఆనంద్‌కుమార్ సొంతపని నిమిత్తం కర్ణాటక రాష్ట్రంలోని గంగావతికి వెళ్లి తిరుగు ప్రయాణంలో కర్ణాటక ప్రాంతంలో మద్యం బాటిళ్లను కొనుగోలు చేశారు. తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీలో ఈ బాటిళ్లు పట్టుబడ్డాయి. ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


అమరచింతలో స్వాధీనం చేసుకున్న బెల్లం నిల్వలతో ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది

3 లీటర్ల మద్యం..

కృష్ణా: మండల సరిహద్దులో గల చెక్‌పోస్టు వద్ద బుధవారం అక్రమంగా తరలిస్తున్న 3 లీటర్ల మద్యంను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ విజయభాస్కర్ మాట్లాడుతూ వాహనాలను తనిఖీ చేస్తున్నా సమయంలో మద్యం లభించిందని, వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గద్వాల క్రైం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. కొన్ని రోజులుగా జమ్మిచేడులో బెల్టు షాపును నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు బుధవారం సాయంత్రం కృష్ణగౌడును అదుపులోకి తీసుకుని 42 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.


కృష్ణా మండలం చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన మద్యం

390 కిలోల బెల్లం పట్టివేత..

అమరచింత: మండలంలోని తూక్యానాయక్ తండాలో బెల్లం తరలిస్తున్న ఆటోను పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ బాలరాజ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకటేష్ బుధవారం మండలంలోని తండాలలో తనిఖీ నిర్వహిస్తుండగా ఆటో వేగంగా వెళ్లడంతో వెంటపడి పట్టుకున్నారు. నిందితుడు సోమ్లానాయక్ పరారీ కాగా ఆటోను సోదా చేయగా వాటిలో 390 కిలోల బెల్లం, 10 కిలోల నవసాగరం గుర్తించారు. ఎన్నికల వేల సారా తయారీకి ఉపయోగపడే విధంగా ముందస్తుగా బెల్లంను నిల్వ ఉంచుకున్నట్లు సమాచారం అందడంతో తండాలో సోదాలు నిర్వహించామన్నారు. సోమ్లానాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

మహిళపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లికి చెందిన ఉడుతల ముత్యాలమ్మ బుధవారం ఉదయం 48 లిక్కర్, 12 బీరు బాటిళ్లు అక్రమంగా తరలిస్తూ మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద పట్టుబడినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హైకోర్టు జడ్జీలుగా నలుగురి పేర్లు సిఫారసు

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు నలుగురు న్యాయవాదుల పేర్లను కేంద్రానికి సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల కొలీజియం మంగళవారం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు చేసిన వారిలో హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నూనేపల్లి హరినాథ్, న్యాయవాది మండవ కిరణ్మయి, ప్రభుత్వ న్యాయవాదిగా వ్యవహరిస్తున్న జగడం సుమతి, న్యాయవాదిగా ఉన్న న్యాపతి విజయ్ ఉన్నారు. ఈ నలుగురి పేర్లకు కేంద్రం ఆమోదముద్ర వేసిన తరువాత ప్రధానమంత్రి కార్యాలయం ద్వారా రాష్ట్రపతికి చేరతాయి. రాష్ట్రపతి ఆమోదముద్ర తరువాత వీరి పేర్లను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీచేస్తుంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరి 22న హైకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా (ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తి) నేతృత్వంలోని కొలీజియం ఏడుగురు న్యాయవాదుల పేర్లను హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు సిఫారసు చేసింది. హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్, యర్రంరెడ్డి నాగిరెడ్డి, ఎస్.రవిప్రసాద్, అశ్వత్థనారాయణ పేర్లను సుప్రీంకోర్టుకు పంపింది. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి కూడా ఈ పేర్లపై తమ అభిప్రాయాలు పంపారు. అనంతరం కేంద్ర హోంశాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ద్వారా రహస్య విచారణ జరిపి ఈ ఏడుగురి వివరాలు తెప్పించుకుంది. ఫిబ్రవరి నుంచి ఈ ఏడుగురి పేర్లు కేంద్రం వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ఈ ఏడుగురి పేర్లను కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టుకు పంపింది. ఈ ఏడుగురి పేర్లపై చర్చించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన కొలీజియం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. అంతకుముందే ఈ ఏడుగురి గురించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో గతంలో న్యాయమూర్తులుగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉన్నవారి అభిప్రాయాలు కూడా తీసుకుంది. మంగళవారం జరిగిన కొలీజియం సమావేశంలో హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్ పేర్లకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులుగా ఈ నలుగురిని నియమించే విషయంలో వీరి నైతికనిష్ఠకు సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి ప్రతికూల నివేదికలు లేవని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నలుగురు హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం అయ్యేందుకు అన్ని రకాలుగా అర్హులని స్పష్టం చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి మాత్రం న్యాపతి విజయ్ విషయంలో ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. ఏడుగురిలో మిగిలిన ముగ్గురి విషయంలో సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం ఏమిటన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు. ప్రస్తుతం హైకోర్టులో సీజేతో సహా 27 మంది న్యాయమూర్తులున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు సిఫారసు చేసిన నలుగురి పేర్లకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 31కి చేరుకుంటుంది.

ఇన్నర్ కేసులో చంద్రబాబుకు తాత్కాలిక ఊరట

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అక్రమాలు, క్విడ్ ప్రోకో ఆరోపణలపై సీఐడీ నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు హైకోర్టు బుధవారం తాత్కాలిక ఊరటనిచ్చింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌లో తదుపరి ముందుకెళ్లొద్దని విజయవాడ ఏసీబీ కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 16వరకు పీటీ వారెంట్ విషయంలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయవద్దని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో తదుపరి ఎలాంటి సమయం ఇచ్చే ప్రసక్తేలేదని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఒకవేళ సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో ఏదైనా కేసులో వాదనలు వినిపించాల్సి ఉంటే ఒక్కరోజు మాత్రమే గడువునివ్వడం సాధ్యమవుతుందని తేల్చి చెప్పారు.

'రింగ్' మాస్టర్ అష్ట వంకర్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేశ్‌కు సీఐడీ ప్రశ్నల వర్షం

- 'ఉప సంఘం' వ్యవహారంపై ప్రశ్నలకు తడబాటు
- హెరిటేజ్ భూముల అంశంపై ప్రశ్నలకు బిత్తరచూపులు
- కరకట్ట నివాసంపై ప్రశ్నించేసరికి కస్సుబుస్సు
- విలేకరుల సమావేశంలోనూ అదే తీరు
- 'సాక్షి'పై అసత్య ఆరోపణలతో విషయాన్ని పక్కదారి పట్టించే యత్నం
- ఇతర విలేకరుల ప్రశ్నలకు చిందులు..
- నేనెక్కడికి వెళ్తానో మీకనవసరం అంటూ అసహనం



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఎన్ని వంకర్లు తిప్పారో.. ఆ కేసులో నిందితుడు నారా లోకేశ్ సీఐడీ విచారణలో ప్రశ్నలకు అన్ని వంకర్లు తిరిగారు. చంద్రబాబు కుటుంబం, ఆయన అస్మదీయుల భూము ల విలువ అమాంతంగా పెరిగేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చిన తీరుపై సీఐడీ అధికా రులు అడిగిన సూటి ప్రశ్నలకు లోకేశ్ నేల చూపులు చూశారు. తాను సభ్యుడిగా ఉన్న మంత్రివర్గ ఉప సంఘం ద్వారానే అక్రమాల కథ నడిపిన తీరును సీఐడీ ఆధారాలతో సహా ముందు పెట్టడంతో బిత్తరపోయారు. హెరిటేజ్ భూముల కొనుగోలు, లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట నివాసంపై ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారు. విచారణకు సహకరించకుండా దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు యత్నించారు.

ఈ కేసులో ఏ–14గా ఉన్న లోకేశ్‌ను సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు వరుసగా రెండో రోజు బుధవారం తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో విచారించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ దర్యాప్తునకు సహకరించకుండా ఉండేదుకు లోకేశ్ అనేక ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ సిట్ బృందం తమదైన శైలిలో కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయన న్యాయవాది సమీప దూరంలో ఉండగా ఆడియో, వీడియో రికార్డింగ్ నిర్వహిస్తూ అధికారులు లోకేశ్‌ను విచారించారు. విశ్వసనీయ సమచారం ప్రకారం ఈ దర్యాప్తునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

అలైన్‌మెంట్ మార్చాలని ఎందుకు ఒత్తిడి చేశారు?

ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు అమరావతి కోర్ కేపిటల్‌పై టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రివర్గ ఉప సంఘం ద్వారా అక్రమాల కథ నడిపిన తీరుపై సీఐడీ లోకేశ్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. జూనియర్ మంత్రి అయినప్పటికీ లోకేశ్‌కు ఉప సంఘంలో స్థానం కల్పించడంపై మొదటగా ప్రశ్నించింది. పేరుకు మంత్రివర్గ ఉప సంఘం అయినప్పటికీ ఇతర సభ్యులకంటే అందులో లోకేశ్, నారాయణదే హవా అని, భూ సమీకరణ, ఇన్నర్‌రింగ్ రోడ్డుకు భూసేకరణపై వీరే కీలకంగా వ్యవహరించినట్టు సీఐడీ ఆధారాలు సేకరించింది. వాటిని లోకేశ్‌కు చూపిస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని సీఆర్‌డీఏ అధికారులపై ఎందుకు ఒత్తిడి చేశారని ప్రశ్నించింది. తామేమీ ఒత్తిడి చేయలేదని లోకేశ్ బుకాయించారు. మంత్రివర్గ ఉపసంఘం, టీడీపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే అలైన్‌మెంట్‌ను మార్చినట్లు అప్పటి సీఆర్‌డీఏ అధికారులు వాంగ్మూలం ఇచ్చిన అంశాన్ని సీఐడీ అధికారులు ప్రస్తావించడంతో లోకేశ్ షాక్ తిన్నారు. దాంతో ఆయన నోట మాట రాలేదని సమాచారం. వెంటనే తన న్యాయవాదితో సంప్రదించి చెబుతానని చెప్పారు. న్యాయవాదితో మాట్లాడిన తరువాత కూడా ఆయన ఈ అంశంపై సమాధానం దాట వేసేందుకే ప్రయత్నించారు. ముందుగానే సీఆర్‌డీఏ అధికారులతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించి, దానినే మాస్టర్‌ప్లాన్‌లో చేర్పించి సింగపూర్‌కు చెందిన కన్సల్టెన్సీ ద్వారా ఆమోదింపజేయడం అంటే అక్రమమే కదా అని అధికారులు ప్రశ్నించడంతో లోకేశ్ మౌనంగా ఉండిపోయారు. మంత్రివర్గ ఉప సంఘం వ్యవహారం అంతా బూటకమని, ఆ ముసుగులో చంద్రబాబు, నారాయణ, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతంగా పెంచుకున్నారని సీఐడీ కీలక ఆధారాలు చూపించడంతో లోకేశ్ నిశ్చేష్టుడయ్యారు.

కరకట్ట నివాసం అంశంపై కస్సుబుస్సు

లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట బంగ్లాపై సీఐడీ ప్రశ్నించడంతో లోకేశ్ తత్తరపాటుకు గురై అధికారులపై కస్సుబుస్సులాడారు. ఆ ఇంటికి తాము అద్దె చెల్లించామన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు చూపిస్తూ ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌ను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. దర్యాప్తులో భాగంగా ఏ పత్రాలనైనా సంబంధిత శాఖలను సంప్రదించి తీసుకునే వెసులుబాటు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు ఉందనే అవగాహన ఆయనకు లేకపోవడం విడ్డూరం. లింగమనేని రమేశ్ ఆ కరకట్ట నివాసాన్ని ఉచితంగా ఇచ్చానని ఓసారి, కాదు దేశభక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని మరోసారి చెప్పిన విషయాలను అధికారులు ప్రస్తావించారు. దాంతో అసలు తనకు ఆ కరకట్ట నివాసం గురించి తెలియదని లోకేశ్ బుకాయించారు. మంత్రి హోదాలో మీరు నివసించిన ఇంటి గురించి తెలియదా అని అధికారులు రెట్టించి అడిగేసరికి సమాధానం దాటవేశారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి మరికొన్ని కీలక వ్యవహారాలపై లోకేశ్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. కానీ ఆయన నుంచి సరైన సమాధానం రాలేదు. వీలైనంతవరకు దర్యాప్తునకు సహకరించకుండా విషయాన్ని పక్కదారి పట్టించేందుకే లోకేశ్ యత్నించారు. పలువురు అధికారుల పేర్లను ప్రస్తావిస్తూ వారిని ప్రశ్నించాలని సీఐడీకి సూచించడం హాస్యాస్పదంగా మారింది. దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన నిందితుడు తిరిగి ఇతరలను ప్రశ్నించాలని చెబుతుండటం విడ్డూరంగా ఉందని సీఐడీవర్గాలు వ్యాఖ్యానించాయి. అవసరమైతే మరోసారి విచారణకు రావల్సి ఉంటుందని సీఐడీ అధికారులు లోకేశ్‌కు చెప్పి బుధవారం విచారణ ప్రక్రియను ముగించారు.

హెరిటేజ్ భూముల అంశంపై అసహనం..

➤ ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్ భూములు కొన్న అంశంపై సీఐడీ సూటి ప్రశ్నలకు లోకేశ్ తీవ్ర అసహనానికి గురయ్యారు. ఏ ప్రాతిపదికన ఆ ప్రాంతంలో భూములు కొనాలని హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అధికారులు వేసిన ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమివ్వలేదు. ప్రస్తుతం తాను హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా లేనని, ఆ విషయాలు తనకు తెలియవని అన్నారు. భూములు కొనాలని తీర్మానించిన సమయంలో మీరే డైరెక్టర్‌గా ఉన్నారు కదా అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేయడం గమనార్హం.

సంబంధం లేని ప్రశ్నలువేశారు: లోకేశ్

సీఐడీ అధికారులు తనకు ఏమాత్రం సంబంధం లేని ప్రశ్నలు వేశారని లోకేశ్ చెప్పారు. రెండో రోజు విచారణ అనంతరం సీఐడీ కార్యాలయం బయట మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని ఈ విచారణ ద్వారా తనకు తెలిసిందన్నారు. కరకట్ట నివాసానికి తన తల్లి అద్దె చెల్లించారన్నారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. సాక్షి పత్రికలో షేర్లను కొందరు కొన్నట్లుగా తమ హెరిటేజ్ ఫుడ్స్ షేర్లను లింగమనేని కొనలేదని వ్యాఖ్యానించారు.

'సాక్షి' ప్రశ్నలకు తత్తరపాటు

ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంలో లోకేశ్ పాత్రపై 'సాక్షి' ప్రతినిధులు ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. సాక్షి పత్రికపై అసత్య ఆరోపణలు చేసి విషయాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించారు. కానీ సాక్షి ప్రతినిధులు సూటి ప్రశ్నలు సంధించడంతో తత్తరపాటుకు గురయ్యారు. ఇతర మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. లోకేశ్‌తో సాక్షి, ఇతర మీడియా ప్రతినిధుల సంభాషణ ఇలా సాగింది..

- ➤ **సాక్షి:** మీరు మంత్రివర్గ ఉప సంఘంలో సభ్యుడయ్యాకే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారని, హెరిటేజ్‌ఫుడ్స్‌కు భూములు కొన్నారన్న అభియోగంపై స్పందన ఏమిటి?
- ➤ **లోకేశ్:** మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడిగా నేను ఒత్తిడి చేసి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశానని సీఐడీ అంటోంది. కానీ అది నా శాఖకు ప్రమేయం లేని అంశం. అదే చెప్పా.
- ➤ **సాక్షి:** ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉన్న కంతేరు వైపు ఎందుకు మళ్లింది?
- ➤ **లోకేశ్:** సీఐడీ అధికారులు నాకు బాహుబలి సినిమా చూపించారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ గూగుల్ మ్యాప్ చూపించి ప్రశ్నించారు. ఆ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని నాకు అర్థమైంది.
- ➤ **సాక్షి:** క్విడ్‌ప్రోకో కిందే లింగమనేని మీకు కరకట్ట బంగ్లా ఇచ్చారని సీఐడీ అభియోగం మోపింది కదా?
- ➤ **లోకేశ్:** మాకు క్విడ్ ప్రోకో అలవాటు లేదు. క్విడ్ ప్రోకో ద్వారా సాక్షి మీడియాలో పెట్టుబడులు పెట్టినట్టు మా హెరిటేజ్ ఫుడ్స్‌లో ఎవరూ పెట్టుబడులు పెట్టలేదు.
- ➤ **సాక్షి:** మరి మీకు మాత్రమే లింగమనేని ఆ కరకట్ట బంగ్లాను ఎందుకు ఇచ్చారు?
- ➤ **లోకేశ్:** ఆ ఇంటికి మేము అద్దె చెల్లిస్తున్నాం. ప్రభుత్వానికి ఆ మేరకు లేఖ కూడా రాశాం.
- ➤ **సాక్షి:** అదే నిజమైతే 2019కు ముందు ఎందుకు అద్దె చెల్లించలేదు?
- ➤ **లోకేశ్:** (వెంటనే సమాధానం చెప్పలేక మౌనం వహించారు. కాసేపటికి తేరుకుని..) ఆ విషయం నాకు తెలీదు. నాకు తెలిసినంతవరకు ఇప్పుడు అద్దె చెల్లిస్తున్నాం. మా అమ్మ ఐటీ రిటర్న్ రికార్డులు సీఐడీకి ఎలా వచ్చాయి? దీనిపై న్యాయపోరాటం చేస్తాం.
- ➤ **సాక్షి:** మీ సన్నిహితుడు కిలారు రాజేశ్ ఎందుకు పరారయ్యారు?
- ➤ **లోకేశ్:** ఆయన గురించి నాకేం తెలుస్తుంది? ఎక్కడ ఉన్నారో నాకు తెలీదు
- ➤ **ఇతర మీడియా ప్రతినిధులు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జైలుకు పంపారు అని మీరు అంటున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ విధించేది కోర్టులు కదా?
- ➤ **లోకేశ్:** ఈ కేసులో ఎఫ్‌ఐఆర్ వేసింది జగన్ ప్రభుత్వమే.అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు.
- ➤ **మీడియా ప్రతినిధులు:** మీరు మళ్లీ ఢిల్లీ వెళ్లిపోతారా?
- ➤ **లోకేశ్:** నేను ఎక్కడికి వెళ్తానో మీకు చెప్పాలా? అది మీకు అనవసరం. నేను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని. ఎక్కడికి వెళ్లినా షెడ్యూల్ ఇస్తా.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఒకేషనల్ విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ అబ్దుల్ సమీ, పీఈటీ అఫ్రోజ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రగ్బీ పోటీలకు జిల్లా కేంద్రంలోని టిమిరిస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల బాలుర-3 విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ సమీ తెలిపారు. ఈ పోటీల్లో 8 అండర్–17 విభాగంకు ఆసిఫ్, అండర్–19 విభాగంకు ఎండీ.సాజిద్, ఎండీ.ఖాదర్, గణేష్, దేవిశ్రీప్రసాద్, తరుణ్, అల్తాఫ్, సూఫియాన్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అండర్–17, 19 విభాగం రాష్ట్రస్థాయి పోటీలు మహబూబబాద్ జిల్లా తొర్రూర్‌లో గురువారం నుంచి ఈనెల 15 వరకు రగ్బీ పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆర్‌ఎల్‌సీ బావుద్దీన్, విజిలెన్స్ అధికారులు జమీర్‌ఖాన్, ఆలం ఖాన్, అకాడమిక్ కోఆర్డినేటర్లు సలీం, జహీర్, ప్రిన్సిపాల్ అబ్దుల్ సమీ, పీఈటీ గులాం అఫ్రోజ్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటాలని సూచించారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో సీసీఎఫ్

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామిని బుధవారం అటవీ సంరక్షణ ముఖ్య అధికారి(సీసీఎఫ్) క్షితిజ దర్శించుకున్నారు. ఆమె కుమారుడు తేజతో కలిసి ఆలయానికి రాగా అర్చకులు ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేయించారు. అనంతరం గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ఆలయ ఆవరణలో ఉన్న కల్పవృక్షం(కబంద) చుట్టు ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, నక్క రమేష్, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



రామలింగేశ్వరాలయంలో సీసీఎఫ్ క్షితిజ

ఎస్సీ వర్గీకరణ హామీ నిలబెట్టుకోవాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



బీచుపల్లిలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఎర్రవల్లిచౌరస్తా/పెబ్బేరు రూరల్: కేంద్రం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ఇచ్చిన హామీను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర బుధవారం బీచుపల్లి నుంచి ప్రారంభమై వనపర్తి జిల్లాలోకి చేరుకుంది. ఈ సందర్భంగా 5వ రోజు బీచుపల్లిలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఆయనకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అంతకుముందు బీచుపల్లి ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మాదిగ ప్రజలు 30 ఏళ్లగా రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు. అన్ని పార్టీలు అంగీకరించినా వర్గీకరణ చట్ట రూపంలో తీసుకురావడం కోసం దశాబ్దాలుగా పోరాటం చేయడం ఎంతో బాధాకరమన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి చట్టాలు చేయడమే ప్రజాస్వామ్య ప్రభుత్వాల లక్ష్యమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం ప్రభుత్వాలు పనిచేయాలి కానీ, 75 ఏళ్లుగా మాదిగ ప్రజల కోసం ఏ ప్రభుత్వం పని చేయలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ తమకు పార్లమెంట్‌లో పూర్తి బలం ఉన్నా, గతంలో ఇచ్చిన హామీని ఎందుకు అమలుచేయలేక పోతుందో ప్రధాని నరేంద్రమోదీ ఆలోచించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే పాలకులు ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే నైతిక అర్హతను పూర్తిగా కోల్పోతారని అన్నారు. వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ వెనకబడ్డ జాతుల అభ్యున్నతి కోసం తన ఆరోగ్యాన్ని సైతం పక్కనబెట్టి పాదయాత్ర చేయడం ఎంతో గర్వకారణమన్నారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 341ఏ సవరణ కోసం మంద కృష్ణ మాదిగ ఎంతో కృషిచేశారన్నారు. గతంలో నుంచి అన్ని పార్టీలపై ఒత్తిడి తీసుకొని బడుగు బలహీన వర్గాల యువత అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. పాదయాత్ర పెబ్బేరుకు చేరుకోగా, స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ పర్యటనలో కిషన్‌రెడ్డి సమక్షంలో నరేంద్రమోదీని కలిశానని వర్గీకరణ బిల్లుకు అనుకూలమంటూ జాప్యం చేయడం సరైంది కాదన్నారు.

బంతిపూల సాగు.. భలే బాగు

- పూల తోటలపై రైతన్న ఆసక్తి
- నవాబుపేట మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం
- ఎకరాకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు లాభం



నవాబుపేట వెంకటేశ్వరతండాలో సాగుచేసిన బంతిపూల తోట

నవాబుపేట: బంతిపూల తోటలు రైతులకు లాభాలు తెచ్చి పెడుతున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండటంతో రైతులు పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నవాబుపేట మండలంలోని వెంకటేశ్వరతండా, సత్రోనిపల్లి, దేపల్లి, కోమటికుంటతండా, చౌడూర్ తదితర గ్రామాల్లో రైతులు పూల సాగులో ముందున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా వివిధ రకాల పూలను పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వెంకటేశ్వరతండాలో ఆరేళ్ల కిందట అరెకరా పొలంలో ప్రారంభమైన పూలసాగు.. ప్రస్తుతం 32 ఎకరాలకు పెరిగింది. మండలవ్యాప్తంగా సుమారు 200 ఎకరాల్లో పూలసాగు చేస్తున్నారు. పండించిన పూలను శంషాబాద్, హైదరాబాద్ మార్కెట్లలో విక్రయిస్తున్నారు. ఎకరా సాగుకు పెట్టుబడి పోను రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు లాభం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఒక్కో సీజన్‌లో రైతులు కేవలం పూల తోటలే సాగుచేసి లాభాలు పొందినట్లు చెబుతున్నారు. కాగా పూలతోటలతో వ్యవసాయ పొలాలు కనువిందు చేస్తున్నాయి. వివిధ రకాల పూలతో కళకళలాడుతున్నాయి.

ఎకరాకు 10క్వింటాళ్ల దిగుబడి..



బంతిపూల సాగు ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ధర ఎక్కువ, తక్కువ అయినా దీపావళి సీజన్‌లో కలిసి వస్తుంది. నష్టం వచ్చే సమస్య లేకపోయినా ఇబ్బందులు చాలా ఉన్నాయి. కాగా విత్తనం తీసుకోవడమే ప్రధాన సమస్య. బాగా తెలిసిన వాళ్లతోనే విత్తనం పొందాలి. లేకుంటే పెట్టుబడి, శ్రమ రెండు వృథా అవుతాయి.

– రాములునాయక్, కోమటికుంటతండా

ప్రభుత్వం చేయూతనివ్వాలి..



ఎకరా పూలతోట సాగుకు రూ.50వేలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వం చేయూతనిస్తే మరింత సాగు చేయవచ్చు. ప్రధానంగా పూల విత్తనం ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రైవేటులో తీసుకొచ్చిన విత్తనం ఖర్చు ఎక్కువ. పైగా మళ్లీ ప్రశ్నించే అవకాశం ఉండదు. వివిధ రకాల పూల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తే రైతులు మరింత ఆసక్తి చూపుతారు.

– లింబ్యానాయక్, వెంకటేశ్వరతండా

నాన్నకు ప్రేమతో..!



తండ్రి విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు

- తండ్రి పాలరాతి విగ్రహం తయారు చేయించిన కుమార్తెలు

అడ్డాకుల: తండ్రి పాలరాతి విగ్రహాన్ని తయారు చేయించి అతడిపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు కుమార్తెలు. వివరాల్లోకి వెళ్తే.. అడ్డాకుల మండలం బలీదుపల్లికి చెందిన తుంగ చిన్న రాములు (59), హనుమమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు చెన్నమ్మ, రేణుక, వెంకటమ్మ. కుమారులు లేకపోవడంతో కుమార్తెలను అల్లారు ముద్దుగా పెంచి పెళ్లిళ్లు కూడా చేశారు. ఇంటివద్ద రాములు, ఆయన భార్య ఉండేవారు. గతేడాది అక్టోబర్ 10న ఇంటివద్ద విద్యుదాఘాతానికి గురై చిన్న రాములు మృతిచెందాడు. ఏడాదిలోగా తండ్రి విగ్రహాన్ని తమ పొలం వద్ద ఏర్పాటు చేయాలని కుమార్తెలు నిర్ణయించారు. రూ.2.50 లక్షలు వెచ్చించి రాజస్థాన్‌లో పాలరాతి విగ్రహాన్ని తయారు చేయించారు. మంగళవారం పొలంలో తండ్రి సమాధి వద్ద ఏర్పాటుచేసి పూజలు చేశారు.

భద్రత కమిటీ అప్రమత్తంగా ఉండాలి



భూగర్భ కేంద్రం భద్రతపై సమీక్షిస్తున్న చైర్మన్ సూర్యనారాయణ

దోమలపెంట: శ్రీశైలం భూగర్భ కేంద్రం భద్రత కమిటీ ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని చైర్మన్, సీఈ సూర్యనారాయణ సూచించారు. బుధవారం టీఎస్ జెన్‌కో పరిధిలోని శ్రీశైలం భూగర్భ కేంద్రం భద్రత కమిటీ సభ్యుల సమావేశాన్ని కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానంగా భద్రత వ్యవస్థ, పద్ధతులు, అగ్ని సామగ్రి, కేంద్ర రక్షణ కోసం ముందస్తుగా చేపట్టిన విధానాలు, పరిణామాలు, అభివృద్ధి తదితరాలపై సమీక్షించి, వివరాలను సేఫ్టీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు, నష్టాలను గుర్తించే విధంగా ఉండాలన్నారు. ఆదినారాయణ, శ్రీకుమార్‌గౌడ్, శ్రీధర్, రమేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు

తాడూరు: మండలంలోని గుంతకోడూరులో మిరపపంటను కేవీకే శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా మిరప పంట సాగుచేసిన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్రవేత్తలు డా. ఆదిశంకర్, ఉద్యాన శాస్త్రవేత్తలు కలిసి ప్రస్తుతం పంట కాయ ఏర్పడే దశలో ఉందని, చాలా ప్రాంతాల్లో ఎండు తెగులు, కాండం కుల్లు తెగుళ్లను గమనించారు. ఎండు తెగుళ్ల పంట మొదటి నుంచి యాజమాన్య పద్ధతులను చేపట్టాలన్నారు. ఇందుకు గాను ట్రైకోడెర్మావిరిడి కాపర్‌ఆక్సిక్లోరైడ్, ఎండు తెగులుకు మోంకోజబ్‌కార్బండిజం, ట్యూబుకోనాజల్, కాండం కుల్లుకు ప్రతి వారం రోజుల వ్యవధిలో ఒకసారి మొదళ్లను తడుపుకోవాలని సూచించారు. డా. శైల మాట్లాడుతూ.. కీటక మిరప పంటను అపారనష్టానికి గురిచేస్తున్న నల్ల తామర పురుగును అరికట్టేందుకు మొదటి నుంచే 25:25 తెలుపు, నీలిరంగు జిగురు అట్టలను అమర్చుకోవాలని సూచించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు